
సాక్షి
బాపట్ల

శనివారం, 4, జనవరి, 2025



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 569.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 9,633 క్యూసెక్కులు వదిలారు.



వైభవంగా దీపోత్సవం
నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్ లోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం కుత్తువిళక్కు–విశేష పాశురం, దీపోత్సవం నిర్వహించారు.



వేడుకగా కల్యాణ మహోత్సవాలు
గుంటూరురూరల్: గోరంట్లలోని వేంకటేశ్వర స్వామి పెద్ద గుడిలో దశావతార కల్యాణ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామిని వామనావతారంలో అలంకరించారు.

న్యూస్‌రీల్

వైభవంగా ధనుర్మాస మహోత్సవాలు



తాడేపల్లి రూరల్ : త్రిదండి చిన్న జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ధనుర్మాస వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం మంగళగిరి బాపూజీ విద్యాలయంలో 19వ రోజు 19వ పాశురాన్ని భక్తులకు ఆయన వివరించారు. అనంతరం గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా సీతానగరం జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ.. పలు ప్రాంతాల నుండి సుమారు 700 మంది భక్తులు గోదా అమ్మవారికి సారె సమర్పించారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కూచిపూడి నృత్యాలు భక్తులను అలరించాయి.

మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు పరీక్షలు



నగరంపాలెం: గుంటూరు పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 216 మంది హాజరయ్యారు. 26 మందికి ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనక్కు పంపారు. మిగతా వారిలో 10 మందికి బరువు, ఎత్తు కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. 113 మందికి 100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో 5 మంది, 113 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా 106 మంది అర్హత పొందారు. మొత్తమ్మీద 198 మందికి దేహదారుఢ్య పరీక్షలు జరగ్గా, 106 మంది అర్హత సాధించారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. జిల్లా ఏఎస్పీలు కె.సుప్రజ (క్రైం), ఎ.హనుమంతు(ఏఆర్), సిబ్బంది పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన స్కేటింగ్ క్రీడాకారిణి



తాడేపల్లి రూరల్: మంత్రి నారా లోకేష్‌ను మంగళగిరికి చెందిన స్కేటింగ్ క్రీడాకారిణి మాత్రపు జెస్సీ రాజ్ శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జెస్సీ రాజ్ ఇటీవల రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు అందుకుంది. స్కేటింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందుకు ఈ పురస్కారం దక్కింది. ఆమెను మంత్రి అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

జీఎన్‌ఎమ్ వార్షిక పరీక్షలు ప్రారంభం



గుంటూరు మెడికల్: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ (జీఎన్‌ఎమ్) వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గుంటూరు మెడికల్ కాలేజ్, ప్రభుత్వ నర్సింగ్ స్కూల్‌లో జిల్లా వ్యాప్తంగా 36 నర్సింగ్ స్కూల్స్ నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈనెల 11 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరిగాయి. తొలిరోజు పరీక్షలకు 1500 మందికిగాను ఫైనల్ ఇయర్ విద్యార్థులు 20 మంది, ఫస్ట్ ఇయర్ వారు 94 మంది గైర్హాజరైనట్లు గుంటూరు జీజీహెచ్ ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ కోటా సుజాత తెలిపారు. పరీక్షల చీఫ్ ఎగ్జామినర్‌గా గుంటూరు జీజీహెచ్ సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్ వ్యవహరిస్తున్నట్లు వెల్లడించారు.

నీరుగారుతున్న ఉప్పు రైతు

- మూడు సీజన్‌లుగా కలసి రాని కాలం
- పెరుగుతున్న పెట్టుబడులు
- తగ్గుతున్న దిగుబడి
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

శాపంగా మారిన ప్రకృతి వైపరీత్యాలు



వర్షపు నీరు నిలిచిన ఉప్పు కొఠారు భూములు



వర్షం కారణంగా నీరు నిలిచి కట్టలు తెగిపోయిన కొఠారు భూమి

చినగంజాం: ఉప్పు రైతుపై ప్రకృతి ఏటా కన్నెర్ర చేస్తోంది. గడచిన మూడు సీజన్‌లుగా తీవ్రంగా నష్టాలపాలవుతున్నాడు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య సాగుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. రైతులను సూర్యభగవానుడు కరుణిస్తేనే ఉప్పు సాగు సక్రమంగా సాగేది.గడిచిన మూడు సీజన్‌లుగా వరుస తుఫాన్‌లు, భారీ వర్షాల కారణంగా నష్టపోవక తప్పడం లేదు. ఉప్పు సాగు ప్రతి ఏడాది నవంబరు నుంచి తరువాత ఏడాది జూన్ వరకు దాదాపు ఎనిమిది నెలల పాటు కొనసాగుతుంది. అటువంటిది 2022–23లో నాలుగు నెలలు, 2023–24లో రెండు నెలలు మాత్రమే సాగింది. ఈ ఏడాది (2024–25) సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటినా ఇప్పటివరకు సాగు మొదలు పెట్టే పరిస్థితి కన్పించడం లేదు. వరుస తుఫాన్, భారీ వర్షాలతో ఉప్పు కొఠారుల్లో భారీగా వర్షపు నీరు నిలిచి, సాగుకు అనుకూలత లేకుండా పోయాయి. తొలగించేందుకు మరో నెలకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. నవంబరు, డిసెంబరు నెలలు గడచిపోగా జనవరి, ఫిబ్రవరి నెలలు కూడా సాగుకు నమ్మకం లేకుండా పోయింది.

వేల ఎకరాల్లో నిలిచిన సాగు

- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఊళ్లపాలెం, కనపర్తి, కొత్తపట్నం, చినగంజాం, బాపట్ల జిల్లాలో చినగంజాం మండలంలో చినగంజాం, పెదగంజాం గ్రామాల్లో ఉప్పు సాగు చేస్తున్నారు.
- చినగంజాం మండల పరిధిలో మొత్తం 3000 ఎకరాలలో సాగు చేస్తుండగా దానిలో ప్రభుత్వ భూమి 1800 ఎకరాలు, ప్రైవేట్ భూమి 1200 ఎకరాలు ఉంది. వీటిలో చిన్న, పెద్దరైతులు సుమారు 750 కుటుంబాలు ఉన్నాయి. వీరితో పాటు ఉప్పు కొఠారులలో కూలీలుగా ఎనిమిది వేల మందికి పైగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు.
- ప్రభుత్వ భూమిలో 620 ఎకరాలు చిన్న, సన్నకారు రైతులు రెండు సాల్ట్ సొసైటీలుగా సాగు చేసుకుంటున్నారు.
- చినగంజాం సాల్ట్ వర్కర్స్ కో ఆపరేటివ్ ప్రొడక్షన్స్ సేల్స్ సొసైటీ (ఎల్ నంబర్ 73 అండ్ 86)లో 400 ఎకరాలను 700 కుటుంబాలు, రాజు బంగారుపాలెం సాల్ట్ సొసైటీలో 120 ఎకరాలను 350 కుటుంబాలు ఉప్పు సాగు మీద ఆధారపడి జీవిస్తున్నాయి.
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఊళ్లపాలెం గ్రామ పరిధిలో రెండు సొసైటీలు, కొత్తపట్నం గ్రామ పరిధిలో ఒకటి నడుస్తున్నాయి.
- ఊళ్లపాలెం గ్రామ పరిధిలో ఎస్సీ సాల్ట్ వర్కర్స్ సొసైటీ కింద 500 ఎకరాలు, ఓసీ సాల్ట్ వర్కర్స్ సొసైటీ కింద మరో 350 ఎకరాలు సాగు చేస్తున్నారు.
- కొత్తపట్నం మండలంలోని సాల్ట్ సొసైటీ కింద 275 ఎకరాలలో ఉప్పు సాగు చేస్తున్నారు. వీటితో పాటు సుమారు మరో వేయి ఎకరాలు ప్రైవేట్ భూముల్లో రైతులు సాగు చేస్తున్నారు.

గిట్టుబాటు కాని సాగు

ఉప్పు సాగుకు ఎకరాకు రూ.20 వేలు, రూ.25 వేలు వరకు ఖర్చు అవుతుంది. కౌలు రైతుకు ఎకరాకు అదనంగా మరో రూ. 15 వేలు అవుతోంది. ఈ లెక్కన ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఐదు వేల ఎకరాలకు గానూ రైతులకు రూ రూ.12.50 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు పెట్టుబడి రూపంలో ఖర్చు అవుతోంది. వరుస వర్షాలతో భూములు దెబ్బతిని పెట్టుబడులు కూడా రాకుండా పోయాయి. కౌలు రైతు పరిస్థితి చెప్పనవసరం లేదు. సీజన్ ఆరు నెలలు సాగితే రైతు 20 నుంచి 22 తీతలు ఉప్పు తీసే అవకాశం ఉంది. ఎనిమిది నెలల పాటు సక్రమంగా సాగితే 30 తీతలు అంటే ఎకరాకు రైతు 400 బస్తాలు వరకు దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది. రైతుకు పెట్టుబడి, ఖర్చులు పోను ఎకరాకు రూ. 15 వేలు నుంచి రూ. 20 వేలు వరకు ఆదాయం వస్తుంది. ఇలాంటి పరిస్థితిలో ఎకరాకు 400 బస్తాల నుంచి దిగుబడి 200 బస్తాలకు పడిపోయింది. గడిచిన రెండు సీజన్‌లలో ఖర్చులు కూడా రాని పరిస్థితిలో తీవ్ర నష్టాలపాలయ్యాడు. వరుస ప్రకృతి వైపరీత్యాలతో దిగుబడులు తగ్గడంతో రైతులు గత రెండు సీజన్‌లలో తీవ్రంగా నష్ట పోయారు.

రెండు సీజన్‌లుగా నష్టం



గడచిన రెండు సీజన్‌లు వర్షాలు, తుఫాన్ అలజడులతో తీవ్రంగా నష్టపోయాం. ఆరు నెలలు మాత్రమే కొఠారు సాగింది. గత రెండు సీజన్‌లో పెట్టుబడులు పెట్టడమే తప్పా దిగుబడులు తిరిగి మాకు రాలేదు. దాంతో తీవ్రంగా నష్టపోయాం. ఈ ఏడాది సాగు చేద్దామంటే అసలు వాతావరణం అనుకూలించడం లేదు.

– కందేపి సతీష్, ఉప్పు రైతు, చినగంజాం

సాగుకు స్వస్తి చెప్పాలనిపిస్తోంది



పూర్వం ఉప్పు సాగు అంటే కనీసం పెట్టుబడి, ఖర్చులు పోను కాస్తంత ఆదాయం ఉండేది. ప్రస్తుతం కొన్నేళ్లుగా అలాంటి పరిస్థితి చూద్దామన్నా కన్పించడం లేదు. పూర్తిగా ప్రకృతి ఉప్పు సాగుకు అనుకూలించడం లేదు. గత రెండు సీజన్‌లలో ఖర్చు తప్ప ఆదాయం లేదు. అలాంటి పరిస్థితిలో ఉప్పు సాగు వదిలేద్దామా అని అనిపిస్తోంది.

– తోట నరేంద్ర కుమార్, ఉప్పు కౌలు రైతు, చినగంజాం

ఆదుకోని కూటమి ప్రభుత్వం



ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న రైతులకు కరెంటు బిల్లు భారంగా మారుతోంది. గత ప్రభుత్వాలు ఉప్పు రైతులకు సబ్సిడీ ఇచ్చి ఆదుకున్నాయి. కూటమి ప్రభుత్వం విద్యుత్ బిల్లు రాయితీ ఇవ్వకపోగా పెంచి ఇబ్బంది పెడుతోంది.


– బొడ్డు ఏడుకొండలురెడ్డి, చినగంజాం సాల్ట్ వర్కర్స్ అండ్ కో ఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్, కొత్తపాలెం

రెవెన్యూ అధికారులపై

ఫోర్జరీ కేసు

మేదరమెట్ల: కోర్టు ఉత్తర్వులను ధిక్కరించిన రెవెన్యూ అధికారులపై ఫోర్జరీ కేసు నమోదైంది. కొరిశపాడు మండలం మేదరమెట్ల పోలీసు స్టేషన్‌లో గత నెల 30న తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, వీఆర్వో సహా మరో ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మహ్మద్ రఫీ వివరాల మేరకు.. మేదరమెట్ల గ్రామానికి చెందిన మార్పూడి వెంకటేశ్వర్లుకు ఆదే గ్రామానికి చెందిన నెక్కంటి సుబ్బారావు నగదు ఇవ్వాలి. పాత బకాయిల విషయంపై 2023 మార్చి 23న ఒంగోలు కోర్టులో వెంకటేశ్వర్లు దావా వేశాడు. దీంతో కోర్టు సుబ్బారావుకు చెందిన 575/33సీ–1 సర్వేలో ఉన్న 44 సెంట్ల భూమిని అటాచ్ చేస్తూ తీర్పు ఇచ్చింది. ఈ విషయాన్ని బాధితుని తరపు న్యాయవాది అద్దంకి సబ్ రిజిస్ట్రార్, కొరిశపాడు తహసీల్దార్‌కు తెలిపారు. కోర్టు అటాచ్ చేసిన అంశాలకు సంబంధించి మార్పులు చేయకూడదనే నిబంధన ఉన్నా రెవెన్యూ అధికారులు ఆదేశాలను ధిక్కరించి 2023 జూన్ 28న సుబ్బారావుకు 85 సెంట్ల భూమి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో ఎక్కించారు. దీనిపై బాధితుడి తరపు న్యాయవాది అద్దంకి కోర్టులో పిటిషన్ వేశారు. దీంతో కోర్టు ఆదేశానుసారం అప్పటి సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్, వీఆర్వోతో పాటు మరో ఆరుగురిపై ఫోర్జరీ కేసు నమోదు చేసి నోటీసులు అందజేయనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1716 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 140, తూర్పు కెనాల్‌కు 174, నిజాంపట్నం కాలువకు 34, కొమ్మమూరు కాలువకు 975 క్యూసెక్కులు విడుదల చేశారు.



జంపనిలోని చక్కెర ఫ్యాక్టరీ (ఫైల్)

ఇంత నిర్దయా బాబు..!

జంపని చక్కెర ఫ్యాక్టరీ ఉద్యోగుల ఎదురుచూపులు

- టీడీపీ ప్రభుత్వ హయాంలో కర్మాగారం మూసివేత
- అంతకుముందు రెండుసార్లు ప్రైవేటుకు విక్రయం
- వైఎస్సార్ చొరవ, కార్మికుల పోరుతో తిరిగి 'సహకారం'లోకి..
- అసమర్థ నిర్వహణతో మళ్లీ మూసివేత
- ఉద్యోగులకు జీతాలు చెల్లించని నాటి పాలకులు
- వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఉద్యోగులకు బకాయిల చెల్లింపు, వీఆర్ఎస్‌కు వీలుగా జీవో
- తొలి విడతగా రూ.3.70 కోట్లు విడుదల
- మిగిలి బకాయిలు చెల్లించాలని కూటమి ప్రభుత్వానికి బాధితుల డిమాండ్

తెనాలి/వేమూరు: తెనాలి సమీపంలోని ప్రస్తుత బాపట్ల జిల్లా పరిధిలో ఉన్న జంపని చక్కెర ఫ్యాక్టరీ తెనాలికి చెందిన సహకారోద్యమకారుల మానస పుత్రిక. 1974లో శంకుస్థాపన జరిగినా ఎన్నో ఆటుపోట్ల తర్వాత 1984 ఫిబ్రవరిలో క్రషింగ్ ప్రారంభించారు. 2012లో మూత పడేంతవరకు మూడు సీజన్లలోనే సామర్థ్యానికి సరిపడా రూ.1.60 లక్షల టన్నుల చెరకును క్రషింగ్ చేయగలిగింది. చెరకు విస్తీర్ణాన్ని తగినంత పెంచటంలో టీడీపీ పాలక వర్గాలు విఫలమయ్యాయి.

వైఎస్సార్ హయాంలో ఊరట

ఈ నేపథ్యంలో 2002–03లో నాటి టీడీపీ ప్రభుత్వం సహకార చక్కెర ఫ్యాక్టరీలను దశలవారీగా ప్రైవేటుపరం చేసింది. అదే ఏడాది జంపని ఫ్యాక్టరీని జయపూర్ షుగర్స్‌కు అప్పగించారు. తర్వాత తమకు వద్దని ఆ సంస్థ వెనక్కి వెళ్లింది. దీంతో క్రైబ్స్ బయో కెమికల్స్‌కు విక్రయించారు. కార్మికులు, ఉద్యోగులు ఆందోళన చేసినా ఫలితం లేకుండాపోయింది. 2004వ సంవత్సరంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తిరిగి 'సహకారం'లోకి తీసుకొచ్చేందుకు చొరవచూపారు. ఉన్నత న్యాయస్థానాల్లోనూ అనుకూలంగా ఉత్తర్వులు రావటంతో 2004 డిసెంబరులో సహకారం రంగంలోకి ఫ్యాక్టరీ వచ్చింది. మూడు నాలుగేళ్లు బాగానే నడిచినా 2008–09, 2009–10, 2020–11 సీజన్లలో మూతపడింది. తెరిపించేందుకు నాటి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న మోపిదేవి వెంకట రమణారావు రూ.5.08 కోట్ల రుణం మంజూరు చేయించారు. సకాలంలో అవి అందకుండా చేయటంలో చంద్రబాబు అనుకూలురైన ఓ ఉన్నతాధికారి చక్రం తిప్పారని ఆరోపణలున్నాయి. నిధుల జాప్యంతో రైతులతో అగ్రిమెంట్లు చేసుకోలేకపోయారు. అధికమొత్తం చెరకు కృష్ణా జిల్లాలోని ప్రైవేటు ఫ్యాక్టరీకి తరలిపోయింది. 2012 సీజనులో కేవలం 15 టన్నుల చెరకు మాత్రమే క్రషింగ్ చేయగలిగారు.

రోడ్డున పడ్డ ఉద్యోగులు

ఫ్యాక్టరీ మూసివేతతో ఉద్యోగులు రోడ్డున పడ్డారు. వారికి ఏళ్ల తరబడి జీతాలు లేవు. ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నా ఫలితం లేదు. తర్వాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పడ్డాక దీనిపై దృష్టి సారించారు. ఏళ్ల తరబడి మూసి ఉన్న జంపని ఫ్యాక్టరీలో యంత్రాలు తుప్పుపట్టిపోయాయి. దీంతో 2013 జులై నుంచి ఏప్రిల్ 2022 వరకు కటాఫ్ తేదీ నిర్ణయించి రిటైరైన ఉద్యోగులకు బకాయిల చెల్లింపు, సర్వీసు కలిగిన వారికి వీఆర్ఎస్ ఇవ్వటం, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు ఆరు ఫ్యాక్టరీలకు మొత్తం రూ.108.32 కోట్లు ఇచ్చేందుకు 2022–23లో జీవో విడుదల చేశారు. ఆ మొత్తంలో జంపని ఫ్యాక్టరీకి రూ.14.07 కోట్లు రావాల్సి ఉంది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయంపై ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమైంది. బకాయిలు, సర్వీసు ఉన్నవారికి జీవో ప్రకారమే 2023 డిసెంబరులో రూ.3.70 కోట్లను విడుదల చేశారు. తర్వాత ప్రభుత్వం మారిపోయింది. ఇప్పుడు కూటమి సర్కారు మిగతా బకాయిలను చెల్లించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

తీరంలో ఘోరం



వాడరేవు సముద్రంలోకి ట్యాంకర్ ద్వారా వదులుతున్న వ్యర్థాలు

- వ్యాపారులకు కాసులు
- పర్యాటకులకు రోగాలు
- రోజూ వేల లీటర్ల వ్యర్థ, కలుషిత జలాలను సముద్రంలోకి వదులుతున్న ప్రాసెసింగ్ యూనిట్లు, హేచరీలు
- కన్నెత్తి చూడని అధికారులు

చీరాల టౌన్: సముద్రాన్ని చూస్తే ఎంతటి వారికైనా ఆహ్లాదం, ఆనందం, ప్రశాంతత లభిస్తాయి. అనిర్వచనీయమైన అనుభూతి కలుగుతుంది. అయితే, నియోజకవర్గంలోని సముద్ర తీరం దీనికి భిన్నంగా ఉంది. కుళ్లిన వ్యర్థాలు, రొయ్యల ఫ్యాక్టరీలు, హేచరీల నుంచి వచ్చే రసాయనాలతో కలుషితం అవుతోంది. ట్యాంకర్లతో రోజుకు వందలాది లీటర్ల వ్యర్థాల నీటిని యథేచ్ఛగా సముద్రంలోకి వదులుతున్నారు. దీంతో సముద్ర తీర ప్రాంతం అంతా దుర్గంధం వ్యాపిస్తోంది. కళ్లెదుటే వ్యర్థాల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నా పంచాయతీరాజ్, మత్స్యశాఖ, పొల్యూషన్ కంట్రోల్ సిబ్బంది, అధికారులు కళ్లు మూసుకుని విధులు నిర్వహిస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల వల్లే చేటు

జిల్లాలో చీరాల, వేటపాలెం, బాపట్ల, నిజాంపట్నం, చినగంజాం తీరప్రాంత మండలాలున్నాయి. 76 కిలో మీటర్ల మేర సముద్ర తీరం ఉంది. ఈ తీరం ఒడ్డునే మత్స్య సంపదను ఎగుమతికి చేసేందుకు పలు ఫ్యాక్టరీలు కూడా ఉన్నాయి. వీటితో పాటుగా రొయ్యలు, చేపలు ప్రాసెసింగ్ కంపెనీలతో పాటుగా హేచరీలు కూడా ఉన్నాయి. బాపట్ల పాండురంగాపురంలో ఎనిమిది, వాడరేవు రామాపురం తీరప్రాంత గ్రామాల్లో ఎనిమిది ప్రాసెసింగ్ హేచరీలు, యూనిట్లు ఉన్నాయి. వాడరేవులో రొయ్యలు, చేపలు ప్రాసెసింగ్ చేసి లక్షల్లో సంపాదించే బడా వ్యాపారస్తులు రోజుకు 1.5 లక్షల నీటిని వినియోగిస్తుంటారు. ప్రాసెసింగ్‌లో వచ్చిన 50 వేల లీటర్ల వ్యర్థాల నీటిని మాత్రం యథేచ్ఛగా ట్యాంకర్ల ద్వారా వాడరేవు–రామాపురం మధ్య సముద్రంలోకి వదులుతున్నారు. ప్రతీ రోజు తెల్లవారుజామున, రాత్రి ఎనిమిది గంటల నుంచి ఈ తంతు నడుపుతున్నారు. ఒక్కో ప్లాంట్ రోజుకు రెండు విడతలుగా 10 ట్యాంకర్లు ద్వారా కుళ్లిన చేపల వ్యర్థాలు, రసాయనాల నీటిని సముద్రంలో వదులుతున్నారు. కలుషిత, మురుగునీటిని సముద్రంలో కలపడం వల్ల మత్స్య ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతోందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్యాంకర్లు ద్వారా వ్యర్థాల నీటిని సముద్రంలో వదులుతున్నప్పటికీ గ్రామంలోనే ఉండే మత్స్యశాఖ ఉద్యోగులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ ఉద్యోగులు కళ్లు మూసుకుని విధులు నిర్వహిస్తున్నారా ? అని వారు ప్రశ్నిస్తున్నారు.

ప్రజల ప్రాణాలకే ముప్పు

ఏడాదికి ఒక్కో ప్లాంట్ నుంచి సగటున రూ.10 కోట్ల నుంచి 20 కోట్లు వరకు వ్యాపారాలు చేసే యజమానులు కనీసం ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవడం లేదు. కనీసం కార్మికశాఖ నుంచి అనుమతులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులు కూడా కనిపించవు. కోట్లలో వ్యాపారం చేసుకునే బడా బాబులు యథేచ్ఛగా ప్రకృతి ప్రసాదించిన కడలిని కలుషితం చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వ్యర్థాలు, కెమికల్, మురుగునీరు కలసిన నీటిలో స్నానాలు చేస్తే చర్మ సంబంధిత అనారోగ్య సమస్యలు ఉత్పన్న అవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

సముద్ర తీర గ్రామాల్లో ఉన్న హేచరీలు, రొయ్యలు, చేపల ప్రాసెసింగ్ యూనిట్లు మురుగు నీటిని, వ్యర్థాలను సముద్రంలోకి వదులుతున్నారని నాకు తెలియదు. ఇది మంచిది కాదు. వ్యాపారులు విధిగా ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాల్సిందే. సముద్రంలోకి వ్యర్థాలు, నీటిని వదిలే వాటిపై చర్యలు తీసుకుంటాం.

– కృష్ణ కిశోర్, మత్స్యశాఖ ఏడీ



పైపుల ద్వారా సముద్రంలోకి యథేచ్ఛగా వదులుతున్న కలుషిత జలాలు

మహిళల జీవనోపాధి పెరుగుదలకు చర్యలు

కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బాపట్ల: మహిళల జీవనోపాధి పెరుగుదలకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. వివిధ శాఖల అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. జీవనోపాధి పథకం అనుసంధానంతో మహిళల ఆర్థిక అభివృద్ధికి బాటలు వేయాలని కలెక్టర్ చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సమర్థంగా చేపట్టాలన్నారు. వారి జీవనోపాధివృద్ధికి అధికారులు సహకరించాలని తెలిపారు. పాడి గేదెల పథకం కింద పొదుపు సంఘాల మహిళలకు వాటిని పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు మండలాల వారీగా లబ్ధిదారుల ఎంపిక వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం గేదెల కొనుగోలు ప్రక్రియ పక్కాగా చేపట్టాలని చెప్పారు. యువతీ, యువకుల ఉద్యోగ నియామకాలకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. బాపట్ల జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించి నివేదిక పంపాలని డీపీఓను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో నమోదయ్యే రెవెన్యూ అంశాల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, డీఆర్‌డీఏ పీడీ పద్మ, డీపీఓ ప్రభాకర్, మత్స్యశాఖ ఇన్‌చార్జ్ ఏడీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా సిరాజుద్దీన్



భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధికార ప్రతినిధిగా వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలుకు చెందిన సయ్యద్ సిరాజుద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయనకు నియామక పత్రం అందింది. పార్టీ కార్యకలాపాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న సిరాజుద్దీన్ నిబద్ధతను గుర్తించిన వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అధికార ప్రతినిధిగా నియమించేందుకు కృషి చేశారు. సిరాజుద్దీన్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు.

హైవేపై ఓలేరు వద్ద కారు బోల్తా

సురక్షితంగా బయట పడిన ఇద్దరు



భట్టిప్రోలు: ఎన్‌హెచ్ 216 ఏ రహదారిపై భట్టిప్రోలు మండలం ఓలేరు సమీపంలో కారు ప్రమాదవశాత్తూ బోల్తా కొట్టిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రేపల్లెకు చెందిన టి. జాష్వి కారు డ్రైవింగ్ చేస్తూ మరో వ్యక్తితో కలసి భట్టిప్రోలు వైపు హైవేపై వస్తున్నారు. ఓలేరు దాటిన తరువాత ఒక్కసారిగా కంగారు పడి బ్రేక్ వేయబోయి ఎక్స్‌లేటర్ తొక్కడంతో పక్కనే ఉన్న పంట పొలాల్లోకి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ స్వల్ప గాయాలతో సురక్షితంగా బయట పడ్డారు. 108 వాహన సిబ్బంది వారిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

క్రోసూరు: మండలంలోని పీసపాడు గ్రామ శివారులో గురువారం రాత్రి రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ నాగేంద్రరావు శుక్రవారం తెలిపారు. వివరాలు తెలుపుతూ సత్తెనపల్లి మండలంలోని రెంటపాళ్ల గ్రామానికి చెందిన కొల్లి లక్ష్మయ్య(45) సొంత పనులపై ద్విచక్రవాహనంపై క్రోసూరు వైపు వస్తూ పీసపాడు అడ్డరోడ్డు సమీపంలో గెదెలు తగిలి కింద పడిపోయాడు. తలకు దెబ్బతగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కొరడా ఝుళి‘పింఛెన్’

- పింఛన్ కోతలకు కూటమి ప్రభుత్వం సిద్ధం
- అర్హులను అనర్హులుగా చూపించేందుకు సర్వేలు
- ఇప్పటికే జిల్లాలోని శాంపిల్ సర్వే పేరుతో 13 శాతం పింఛన్లు తొలగింపు
- తొలగింపు శాతం ఎక్కువ ఉండాలని ఉన్నత అధికారులు ఆదేశాలు

బాపట్ల: పింఛన్ల కోతలకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే అధికారులు శ్రీకారం చుట్టారు. గురువారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, సెర్ప్ సీఈఓ వీరపాండ్యన్ జిల్లా అధికారులను సర్వేలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా మొత్తం టీములుగా వెళ్లారు. దివ్యాంగులు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పింఛనుదారులపై మొదటి విడతగా వేటు వేసేందుకు సిద్ధమయ్యారు. ఈపాటికే యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలో తొలివిడత సర్వే చేపట్టి 13శాతం పింఛన్లు తొలగించేందుకు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశాలు జారీ చేశారు. అయితే, జిల్లా మొత్తం 18శాతం తొలగించేందుకు అవకాశం ఉందని గణాంకాల పూర్వంగా వివరించడంతో దివ్యాంగుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



NTR Bharosa Pensions - Mandal wise Health & Disability pensions Report for the Month of December 2024

జిల్లాలో పింఛన్ల జాబితా

జిల్లాలో పరిస్థితి

బాపట్ల జిల్లాలోని 25మండలాలతో పాటు బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి మున్సిపాల్టీల పరిధిలో దివ్యాంగులు, ఆరోగ్య సమస్యలతో ఉన్న వారు 26,265మంది ఉన్నారు. వీరిలో పూర్తి ఆరోగ్య సమస్యలతో ఉన్నవారు 1,582మంది రూ.10వేలు నుంచి రూ.15వేలు అందుకుంటున్నారు. వీరితోపాటు దివ్యాంగుల కోటా నుంచి 24,683 మందికి నెలకు ఆరువేల రూపాయిలు ఇస్తున్నారు. జిల్లాలో మొత్తం రూ.95కోట్లు మేరకు ప్రభుత్వం దివ్యాంగులు, ఆరోగ్య సమస్యలతో ఉన్నవారికి పింఛన్లు పంపిణీ చేస్తోంది.

కమిటీలతో సర్వేలు

జిల్లా స్థాయిలో అధికారుల పర్యవేక్షణలో సచివాలయాల్లో టీములుగా వేసేందుకు నిర్ణయించారు.ఈ మేరకు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌తోపాటు వైద్యుల బృందం పరిశీలన కమిటీల్లో ఉంటుంది. సచివాలయాల వారీగా సర్వేలు చేపట్టి దివ్యాంగులు, ఆరోగ్యసమస్యలతో ఉన్న వారి పింఛన్లు తొలగించేందుకు నిర్ణయం తీసుకుంటున్నారు.

దివ్యాంగుల జోలికి వస్తే సహించేదిలేదు



దివ్యాంగుల జోలికి వస్తే సహించేదిలేదు. అర్హులైన వారికి మాత్రమే ప్రస్తుతం పింఛన్లు వస్తున్నాయి. ప్రభుత్వం భారం తగ్గించుకునేందుకు అనర్హత వేటు వేయాలని చూస్తోంది. ప్రభుత్వం ఈ విధమైన నిర్ణయం తీసుకుంటే ఆందోళన చేస్తాం. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు అర్హులైన అందరికీ పింఛన్లు ఇచ్చారు.అదే విధంగా ఈ ప్రభుత్వం కూడా ఇవ్వాలి.

–చల్లా రామయ్య,దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు

ప్రభుత్వ వైఖరి సరికాదు



ఆరోగ్యం సరిగాలేని వారికి వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు పింఛన్లు సక్రమంగా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వాటినితొలగించేందుకు కుట్ర చేస్తోంది. పింఛన్లు జోలికి వస్తే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతాం.ఇప్పటికే సూపర్‌సిక్స్ పేరుతో మోసం చేసిన కూటమి ప్రభుత్వం పింఛన్లు తగ్గించేందుకు కుట్ర చేస్తోంది.

-మల్లెల మౌనిక, దివ్యాంగుల విభాగం మహిళా నాయకురాలు

కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

రేపల్లె రూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాలు తప్పవని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమస్యల సాధన కోసం శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలలో ఇంజినీరింగ్ విభాగాల్లో 13 వేల మందికి పైగా కార్మికులు 20 నుంచి 25 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. గత సంవత్సరం 17రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. కార్మికులకు జీతాలు చెల్లించాలని, వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదకరమైన పనులు నిర్వహిస్తున్న కార్మికులకు రిస్క్ అలవెన్స్ చెల్లించాలని, చట్టబద్ధమైన వారాంతపు, క్యాజువల్, జాతీయసెలవులు అమలు చేయాలని విన్నవించారు. ఇంజినీరింగ్ కార్మికులకు అదనపు పనులు కేటాయించినప్పుడు తప్పనిసరిగా టీఏ, డీఏలు చెల్లించాలని కోరారు. ప్రమాద మృతులకు రూ.5లక్షల నుంచి రూ.7లక్షల రూపాయలకు ఎక్స్‌గ్రేషియా పెంచటంతో పాటు, దహన సంస్కారాలకు ఆర్థిక సాయం రూ.15వేల నుంచి రూ.20వేల పెంపునకు సంబంధించిన జీవోలను వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రేపల్లె మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు డి.ప్రభాకరరావు, కార్యదర్శి ఎస్.రవిబాబు, శివ, రవి, రాఘవేంద్రరావు, రమేష్, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

బంధువు చనిపోయాడని వెళ్తుండగా రోడ్డు ప్రమాదం



ప్రమాదంలో మృతి చెందిన నాగేశ్వరరావు



కాలు విరిగిన పొన్నం శ్రీనివాసరావు

- వ్యక్తి మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు
- వేగంగా దూసుకొచ్చిన కారు
- ముందు వెళ్తున్న ఆటోను, స్కూటీని ఢీకొట్టిన కారు
- భగవాన్ రాజుపాలెం వద్ద జాతీయ రహదారిపై ప్రమాదం

జే.పంగులూరు: బంధువు చనిపోయాడని చూసి రావడానికి భార్యాభర్తలు వెళ్తుండగా కారు ఢీకొనడంతో భర్త చనిపోగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని భగవాన్ రాజుపాలెం గ్రామ శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. రేణింగవరం ఎస్‌ఐ వినోద్‌బాబు వివరాల మేరకు.. అద్దంకి మండలం బొమ్మనంపాడు గ్రామానికి చెందిన కె.. నాగేశ్వరరావు (59), భార్యతో కలసి మార్టూరు మండలం తాటివారిపాలెం గ్రామంలో బంధువు మృతి చెందడంతో అక్కడకు స్కూటీపై బయలుదేరారు.

మృత్యువులా దూసుకొచ్చిన కారు

సరిగా జాతీయ రహదారిపై భగవాన్‌రాజుపాలెం దాటిన అనంతరం హోటల్ సమీపంలో స్కూటీ వెనుక ఆటో వెళ్తోంది. ఆ ఆటోలో పంగులూరు గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారులు మార్టూరు మార్కెట్‌కు వెళ్తున్నారు. ఈ ఆటో వెనుక ఒంగోలు వైపు నుంచి కారు అతివేగంగా వస్తోంది. కారు డ్రైవర్ కారును అతివేగంగా నడుపుతూ ఆటోను వెనకవైపు నుంచి బలంగా ఢీకొన్నాడు. ఆటో ఒక్కసారిగా ముందు ఉన్న స్కూటీని ఢీకొని పల్టీలు కొట్టింది. స్కూటీ నడుపుతున్న కే నాగేశ్వరావు, అతని భార్య కింద పడిపోయారు. నాగేశ్వరరావుపై కారు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న పొన్నం శ్రీనివాసరావుకు కాలు విరిగింది. అతని భార్య కవితకు స్వల్ప గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న సుగుణమ్మకు చేయి విరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు, హైవే అంబులెన్స్, పంగులూరు 108, మార్టూరు 108 వాహనాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. తీవ్ర గాయాలైన నాగేశ్వరరావు భార్యను, సుగుణమ్మను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాలు విరిగిన శ్రీనివాసరావును, అతని భార్య కవితను నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. ఆటో నడుపుతున్న నందవరపు పీరాకు స్వల్ప గాయాలయ్యాయి. నాగేశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రేణింగవరం ఎస్‌ఐ తెలిపారు.

బాల వైజ్ఞానిక ప్రదర్శనల నిర్వహణ అభినందనీయం



విద్యార్థికి సైకిల్‌ను బహూకరిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల: విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా సక్తిని వెలికితీస్తూ వారిని ప్రోత్సహించే లక్ష్యంతో బాల వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు పేర్కొన్నారు. బాపట్ల మున్సిపల్ హైస్కూలులో బాల వైజ్ఞానిక ప్రదర్శనలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి విద్యార్థులు రేపటి భావి శాస్త్రవేత్తలుగా మారేందుకు సైన్స్ ఫెయిర్ లాంటి ప్రదర్శనలు తోడ్పడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకుంటారని తెలిపారు. ముందుగా మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటాలకు నివాళి అర్పించారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం. నాగిరెడ్డి మాట్లాడుతూ రాబోయే తరానికి కావలసిన సాధనాలను కనిపెట్టే బాధ్యత విద్యార్థులపై ఉందని తెలిపారు. ఉప విద్యాశాఖ అధికారులు ఎ. శ్రీనివాసరావు జి. వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖ అధికారులు డి. ప్రసాదరావు, నిరంజన్, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజశ్రీ , సైన్స్ కోఆర్డినేటర్లు ఎ. శ్రీనివాస రావు, పవని భానుచంద్ర, వై.వై. రావు,సికిందర్ మీర్జాన్ పాల్గొన్నారు. మొత్తం 25 మండలాల నుంచి 175 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ ప్రదర్శనలో పాల్గొని 75 ప్రాజెక్టులను చక్కగా వివరించారు.

5న గ్రూప్-1 ఉచిత శిక్షణకు పరీక్ష



గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద కమ్మ సామాజిక విద్యార్థినులకు గ్రూప్-1 ఉచిత శిక్షణ, వసతి సదుపాయాలను కల్పించనున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ పీపీ లక్ష్మయ్య తెలిపారు. కుందులరోడ్డులోని కమ్మజన సేవా సమితిలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో లక్ష్మయ్య మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన గుంటూరులోని జేకేసీ కళాశాలలో, వినుకొండ, హైదరాబాద్‌లలోని తమ సంస్థ కార్యాలయాల్లో ఎంపిక పరీక్ష జరుగుతుందని చెప్పారు. విద్యార్థినులు 83309 34815 నంబరుకు వివరాలను పంపాలని కోరారు. సమావేశంలో కమ్మజన సేవా సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్, సభ్యులు సీతారామయ్య, పెద్ది సాంబశివరావు, చావా బోస్ పాల్గొన్నారు.

రైల్వే పురస్కార గ్రహీతలకు అభినందన

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ముగ్గురికి జోనల్ స్థాయిలో 69వ రైల్వే వారోత్సవాల్లో విశిష్ట రైల్ సేవా పురస్కారాలు దక్కడంతో వారిని డీఆర్‌ఎం రామకృష్ణ అభినందించారు. గత నెల 31వ తేదీన సికింద్రాబాద్‌లోని రైల్ కళారంగ్‌లో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులు కె.సీతారామయ్య, కె.హరిచంద్రుడు, కె.మల్లికార్జునరావులు ఈ అవార్డులు అందుకున్నారని గుర్తుచేశారు.

రైలు పట్టాలపై గాలిపటాలు ఎగురవేయొద్దు

విద్యుదీకరించిన రైల్వే లైన్ల వద్ద గాలిపటాలు ఎగురవేయడాన్ని నివారించాలని డీఆర్‌ఎం రామకృష్ణ తెలిపారు. రైలు పట్టాలపై ఉన్న ఓవర్ హెడ్ హైటెన్షన్ వైర్లు 25 వేల ఓల్టుల విద్యుత్‌ను సరఫరా చేస్తుంటాయని తెలిపారు.

పూర్వ పంచాయతీ కార్యదర్శిపై చర్యలకు తీర్మానం

తూములూరు (కొల్లిపర): మండలంలోని తూములూరు గ్రామంలో గత పంచాయతీ కార్యదర్శిపై సరిగా విధులు నిర్వహించలేదని గ్రామసభలో తీర్మానం చేసిన సంఘటన తూములూరులో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. దీనిపై గ్రామ ప్రజలు మాట్లాడుతూ.. గతేడాది అక్టోబర్‌లో పంచాయతీ కార్యదర్శి మృత్యుంజయరావు విధుల్లో ఉండగా జరిగిన గ్రామ సభలో ఇంటి పన్ను వసూలు సవరణకు చేసిన తీర్మానం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లలేదు. ఈ విషయం జనవరి 2వ తేదీన జరిగిన గ్రామ సభలో వెల్లడైంది. దీనిపై ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ బదిలీపై వెళ్లటం వల్ల ఆ పని చేయలేక పోయినట్లు పూర్వ పంచాయతీ కార్యదర్శి తెలిపినట్లు వెల్లడించారు. ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్తామని తెలిపారు.

6న సత్తెనపల్లిలో జాబ్ మేళా

సత్తెనపల్లి: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడాప్ అధ్వర్యంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 6న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా జరుగు తుందని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు శుక్రవారం తెలిపారు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిసర ప్రాంత యువత జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని వివరించారు. మేళాలో నాలుగు కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు.

న్యాయవాది కామేపల్లి కృషిబాబుకు ఘన నివాళి



కృషిబాబు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి, రాజేంద్ర

బాపట్ల: హైకోర్టు న్యాయవాది కామేపల్లి కృషిబాబు తమకు ఆత్మీయుడని మహారాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి వి.కె.పాటిల్ తమ్ముడు రాజేంద్ర వి.కె.పాటిల్ పేర్కొన్నారు. ఇటీవల స్వర్గస్తులైన నరసాయపాలేనికి చెందిన కామేపల్లి కృషిబాబు చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కృషిబాబు తన క్లాస్‌మేట్ అని, ఇద్దరం కలిసే ఉండే వారమని రాజేంద్ర గుర్తు చేసుకున్నారు. కృషిబాబు కుటుంబ సభ్యులు కామేపల్లి భూపాల్‌ను పరామర్శించి సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, శాంతారం, మానం విజేత, రాంబాబు ఉన్నారు.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి


కవి డాక్టర్ కత్తి పద్మారావు



సభలో మాట్లాడుతున్న కత్తి పద్మారావు

పొన్నూరు: దేశంలో స్త్రీ విద్యా విప్లవాన్ని ప్రారంభించిన సాంస్కృతిక యోధురాలు సావిత్రి బాయి పూలే జయంతిని రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని దళిత మహాసభ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, కవి డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. శుక్రవారం లుంబినీవనంలోని అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. కత్తి పద్మారావు, మాతా రమాబాయి అవార్డు గ్రహీత కత్తి స్వర్ణకుమారి, రీసెర్చ్ సెంటర్ సభ్యురాలు దాసరి శ్యామల, కట్టా సృజన, గేరా ప్రసన్న, రాణి, శాంతి, హేమ, మాధవ్, అక్కిదాసు జాషువా, షబ్బీర్ అలీ, పాల్గొన్నారు. లుంబినీవనంలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో కత్తి పద్మారావు మాట్లాడుతూ.. మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వంపై ముప్పై ఏళ్లుగా పోరాడుతున్నామని అన్నారు. ఈ మేరకు తెలంగాణ ప్రకటించడం హర్షణీయమన్నారు. సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రను 6వ తరగతి నుంచి ఎంఏ వరకు పాఠ్యాంశంగా పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి స్కూల్లో ఆమె చిత్రపటాలు, విగ్రహాలను ఆవిష్కరించాలని కోరారు. రెండు రాష్ట్రాలలో ఆమె పేరిట మహిళా విశ్వ విద్యాలయాలను నెలకొల్పాలని అన్నారు.

జీజీహెచ్‌లో రూ. 18 కోట్లతో పెట్ సిటీ



గుంటూరు మెడికల్: క్యాన్సర్ రోగులకు శుభవార్త. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు అత్యంత ఖరీదైన, కీలకమైన అత్యాధునిక వైద్య పరికరం గుంటూరు జీజీహెచ్‌లో అందుబాటులోకి రానుంది. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో సుమారు రూ.18 కోట్లు వెచ్చించి ఏర్పాటు చేయనున్న జీఈ కంపెనీ పెట్ సిటి పరికరం ఏర్పాటుకు సంబంధించి టర్న్ కీ పనులకు శుక్రవారం ప్రారంభ పూజ నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ కొబ్బరి కాయ కొట్టి పూజ చేశారు. నాట్కో సమన్వయకర్త యడ్లపాటి అశోక్‌కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గిరిజవోలు దుర్గాప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–2 ఆవుల విజయ పాల్గొన్నారు. క్యాన్సర్ రోగులకు రాబోవు ఉగాది నాటికి పెట్ సిటి అందుబాటులోకి రావచ్చని సూపరింటెండెంట్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం



హరికృష్ణ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

మేదరమెట్ల: గుర్తు తెలియని వాహనం మోపెడ్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈఘటన కొరిశపాడు జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. జే.పంగులూరు మండలం రేణింగవరం గ్రామానికి చెందిన అన్నపురెడ్డి హరికృష్ణ (29) కొరిశపాడులోని పొగాకు కంపెనీలో కూలీలకు ఉదయాన్నే టీ అందజేసి తిరిగి వెళుతున్నాడు. అదే సమయంలో ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం మోపెడ్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో హరికృష్ణ రోడ్డుపై పడిపోయాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఢీకొన్న వాహనం అక్కడ నుంచి వెళ్లిపోయింది. సమాచారం తెలుసుకున్న మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు మేదరమెట్లలో ఓ మెడికల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఇంకా వివాహం కాలేదు.

పూలే దంపతుల కృషి చిరస్మరణీయం



సావిత్రిబాబు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ కె.గంగాధరరావు తదితరులు

ఏఎన్‌యూ: దేశంలో మహిళా విద్యకు పూలే దంపతులు మార్గదర్శకులని వీసీ ఆచార్య కె. గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాబు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. వీసీ, యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది, పరిశోధకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే సామాజిక సంస్కర్త, రచయిత, విద్యావేత్తగా సేవలు అందించారని కొనియాడారు. స్త్రీల అణచివేతను వ్యతిరేకించి సమాజంలో సమానత్వం కోసం కృషిచేశారన్నారు. మహిళలకు, అణగారిన వర్గాల ప్రజలకు విద్యను అందించడానికి పూలే దంపతులు చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే బాల్య వివాహాలను వ్యతిరేకించి వారికోసం మొదటి పాఠశాలను ప్రారంభించారని తెలిపారు. వితంతువుల కోసం ఒక గృహాన్ని కూడా స్థాపించారని గుర్తుచేశారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ.. సమాజంలోని తారతమ్యాలను తొలగించడానికి సావిత్రిబాయి పూలే రచనల ద్వారా చైతన్యాన్ని తెచ్చారన్నారు. అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎం.త్రిమూర్తిరావు నివేదికను సమర్పించారు. ప్రిన్సిపల్స్ ఆచార్య ఎం. సురేష్ కుమార్, ఆచార్య పి.సిద్దయ్య, ఆచార్య ఎ. ప్రమీలా రాణి, అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, గాంధీ అధ్యయన కేంద్రాల సంచాలకులు ఆచార్య వై.అశోక్ కుమార్, ఆచార్య పీజే రత్నాకర్, ఆచార్య కె.సోమశేఖర్, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు, సీఈ ఎ. శివప్రసాదరావు, నోడల్ ఆఫీసర్ ఆర్. ప్రకాశరావు, డీఈ వెంకటేశ్వర్లు, వికాస మాజీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, జాతీయ బి.సి.సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు వై. నూకాలమ్మ, పూలే సెంటర్ ప్రోగ్రామర్ బి. కోటి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం ధ్వంసం

చోరీకి విఫలయత్నం



నకరికల్లు: ఏటీఎంలో చోరీకి గుర్తుతెలియని దుండగులు విఫలయత్నం చేశారు. డబ్బు చోరీ చేసేందుకు వీలుపడకపోవడంతో ఏటీఎం పరికరాన్ని ధ్వంసం చేసి స్క్రీన్, కీబోర్డ్, ఇతర సామగ్రిని పగులగొట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కన అండర్‌పాస్ దగ్గర ఇండియా వన్ ఏటీఎంను ఏర్పాటు చేశారు. ఏటీఎం వద్ద సెక్యూరిటీ ఎవరూ ఉండరు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో మాత్రమే ఏటీఎం ఉంటుంది. గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఏటీఎంలోకి ప్రవేశించి డబ్బును చోరీ చేసేందుకు యత్నం చేశారు. బయటకు తీయడం వీలు కాకపోవడంతో కంప్యూటర్ పరికరాలను పూర్తిగా ధ్వంసం చేశారు. గతంలో కూడా ఇదే ఏటీఎంలో చోరీ జరిగింది. ఘటనపై శుక్రవారం నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా సురేష్ తెలిపారు.